క్లుప్తంగా

కిమ్స్‌లో ఉచిత స్క్రీనింగ్ శిబిరం


హెపటైటిస్ పరీక్షలు చేస్తున్న కిమ్స్ సిబ్బంది

అరసవల్లి:స్థానిక కిమ్స్ గ్యాస్ట్రో సెంటర్‌లో బుధవారం నిర్వహించిన హెపటైటిస్‌–బీ, హెపటైటిస్‌–సీ స్క్రీనింగ్ పరీక్షల ఉచిత వైద్యశిబిరం విజయవంతమైందని కిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ సోమేశ్వరరావు తెలిపారు. శిబిరానికి 50 మందికి పైగా హాజరయ్యారు. వీరికి గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ పైలా రమేష్ ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. తదుపరి చేయించుకోవాల్సిన చికిత్సలపై అవగాహన కల్పించారు.

వలంటీర్లకు సత్కారం


ప్రశంసాపత్రాలతో వలంటీర్లు

ఎచ్చెర్ల క్యాంపస్: సంతసీతారాంపురం గ్రామ సచివాలయం వద్ద గ్రామ వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. గ్రామ వలంటీర్లను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు సత్కరించి ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దుంప చిన్నారెడ్డి, అలుపన బుజ్జి, గవిరెడ్డి రవికుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు ఇన్వర్టర్ వితరణ


ఇన్వర్టర్‌ను అందజేస్తున్న సర్పంచ్ నారాయణమూర్తి

గార: బూరవెల్లి ఎంపీ యూపీ పాఠశాలకు స్థానిక సర్పంచ్ మల్ల నారాయణమూర్తి రూ.20 వేల విలువైన ఇన్వర్టర్‌ను వితరణ చేశారు. ఇన్వర్టర్ కోసం ఎనిమిదో తరగతి విద్యార్థులు చందాలు పోగు చేస్తున్నారని తెలుసుకున్న సర్పంచ్ స్పందించి వెంటనే తన సొంత నిధులతో కొనుగోలు చేసి ఉపాధ్యాయులకు బుధవారం అందజేశారు. గతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశానని, ఏదైనా అవసరమయితే తనను సంప్రదించాలని సర్పంచ్ కోరారు. హెచ్‌ఎం బి.గణేశ్వరరావు, షేక్ జాఫర్, మల్ల మాధవనాయుడు, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పి.వరంబాబు ఉన్నారు.

బాలికలు ఉన్నత విద్యను అభ్యసించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకన్నబాబు

జి.సిగడాం: ప్రతీ బాలిక ఉన్నత విద్యను అభ్యసించి, అన్ని రంగాల్లోనూ ప్రథమ స్థానంలో నిలవాలని ఎంపీడీఓ కె.వెంకన్నబాబు అన్నారు. స్థానిక కేజీబీవీలో భేటీ బచావో–భేటీ పడావో కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. బాల్య వివాహాల నిర్మూలన కోసం గ్రామ స్థాయిలో పనిచేస్తున్న అంగన్‌వాడీలు, ఏఎన్‌ఎంలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.ఉషారత్నకుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ధ్యానంతో ఏకాగ్రత


పుస్తకాలను ప్రదర్శిస్తున్న దృశ్యం

గార: ధ్యానంతో విద్యార్థుల్లో ఏకాగ్రత కుదురుతుందని పిరమిడ్ స్పిర్చువల్ సొసైటీ మాస్టర్ బింధుమాధవి అన్నారు. బుధవారం శ్రీకూర్మంలోని బాలుర, బాలికల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ధ్యానంపై అవగాహన తరగతులు నిర్వహించారు. పరీక్షల సమయంలో విద్యార్థులపై ఒత్తిడి సహజమని, దాన్ని తొలగించుకుంటేనే ప్రతీ విషయం గుర్తు ఉంటుందన్నారు. రోజూ ధ్యానం చేయడం వలన విద్యార్థుల్లో ఏకాగ్రతతో పాటు జ్ఞాపకశక్తి పెరుగుతోందన్నారు. ఈ సందర్భంగా ధ్యానంపై అవగాహన కల్పించే పుస్తకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ముత్యాలరావు, ప్రమీల, కుమారి ఉన్నారు.

12, 13 తేదీల్లో సహస్ర కలములతో పూజలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్న విజయ గణపతి ఆలయంలో ఈనెల 12, 13 తేదీల్లో సహస్ర కలములను గణపతి ఎదుట ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మలు తెలిపారు. విద్యార్థులు ముందుగా తమ గోత్రనామాలను ఆలయం వద్ద నమోదు చేయించుకోవాలని సూచించారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్


ఎచ్చెర్ల: తాళ్లవలస గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్


జి.సిగడాం: జూనియర్ కళాశాల భవనాల సముదాయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల: సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. లావేరు మండలంలోని తాళ్లవలసలో ఉపాధి నిధులు రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం భవనాన్ని, రూ.21.8 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతంనాయుడు, జేసీఎస్ ఇన్‌చార్జ్ మీసాల శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి కార్యదర్శి దాసెట్టి తిరుపతిరావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జగ్గరోతు తవిటినాయుడు, సర్పంచ్ బంకపల్లి సీతమ్మ, ఎంపీటీసీ రాజులమ్మ, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చాంద్ బాషా, వ్యవసాయ శాఖ ఏడీ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ జేఈ అప్పన్న, ఎంపీడీఓ కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తకుంకాంలో..

కొత్తకుంకాం పంచాయతీలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.17.5 లక్షలతో నిర్మించిన విలేజీ హెల్త్ క్లినిక్ భవనాన్ని ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యా రంగానికి పెద్దపీట..

జి.సిగడాం: పేదింటి పిల్లవాడికి విద్యను ఆస్తిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక కేజీబీవీలో నాడు–నేడులో భాగంగా రూ.1.10 కోట్లతో నూతనంగా నిర్మించిన జూనియర్ కళాశాల భవన సముదాయాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రతి పాఠశాలను కార్పొరేట్ పాఠశాలగా సీఎం జగన్ తయారు చేశారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ, ఎంపీటీసీ కీర్తి తవ్వమ్మ, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, ప్రిన్సిపాల్ డి.ఉషారత్నకుమారి, అబోతుల జగన్నాధం, ఎర్నేన ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

- మండల సమావేశంలో సభ్యుల వినతి


విద్యుత్ సమస్యలపై చర్చిస్తున్న సభ్యులు

గార: రామచంద్రాపురం, కొమరవానిపేట పంచాయతీలో జగనన్న కాలనీకి విద్యుత్ లైన్లు వేయాలని సర్పంచ్ గొలివి వెంకటరమణమూర్తి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గొండు రఘురామ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. విద్యుత్ అంశంపై జరిగిన చర్చలో ఏఈ పవన్‌కుమార్ సమాధానమిస్తూ త్వరలోనే అంచనాలు వేసి పనులు చేస్తామన్నారు. 200 లోపు యూనిట్లు వాడేవారంతా పీఎం సూర్య పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తామని.. ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. కె.మత్స్యలేశం సర్పంచ్ బి.ఎర్రన్న మాట్లాడుతూ.. వేసవికాలం కావడంతో విద్యుత్ లైన్లు పాడవుతున్నాయని వాటి స్థానంలో కొత్తవి వేయాలని కోరారు. లంకపేట, దీపావళి, కొర్ని గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు పాడయ్యాయని మార్చాలని సర్పంచ్‌లు చల్ల శ్రీనివాసరావు, పీస గోపీ కోరారు. ఎంపీడీవో బి.కల్యాణి మాట్లాడుతూ.. బాల్య వివాహాలు జరగకుండా ప్రజాప్రతినిధులు అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జొన్నలపాడు, అంబటివానిపేటలో పురాతన పాఠశాల భవనములున్నాయని, వాటిని కూల్చేయాలని సర్పంచ్ జీవీఆర్ మూర్తి, ఎంపీటీసీ సభ్యుడు రుప్ప శ్రీనివాసరావు కోరారు. లింగాలవలస ఎంపీటీసీ సభ్యుడు ముద్దాడ గోవిందరావు మాట్లాడుతూ.. పాఠశాలకు వచ్చే మధ్యాహ్న భోజనంలో కొత్త బియ్యం వాడటం వలన విద్యార్థులు తినడం లేదని, క్యారేజీలు తెచ్చుకునే పరిస్థితి ఉందన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు తమ పరిధిలోని పాఠశాలలను తనిఖీలు చేయాలని సూచించారు. కిడిడి సమస్య ఉందని దీనిపై కలెక్టర్‌కు వినతిపత్రం అందించాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు మార్పు సుజాతమ్మ, ప్రత్యేకాధికారి బీవీ రమణమూర్తి, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ అరవల శార్వాణి ఉన్నారు.

పరామర్శ..


నర్సింగరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

జి.సిగడాం: జగన్నాథపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రాయపురెడ్డి నర్సింగరావు ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో మండల వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ రాయపురెడ్డి సూర్యనారాయణ, ఉప సర్పంచ్ ఇజ్జి గోవిందరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

గ్రామాల్లో 'మేము సిద్ధం'

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని లింగాలవలస, కొత్తకుంకాం, పైడాయివలస పంచాయతీల్లో మేము సిద్ధం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎచ్చెర్ల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉలకాపు అప్పలనాయుడు ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలియజేశారు. పార్టీ నాయకులు బూరాడ వెంకటరమణ, వాద్రంగి సర్పంచ్ సొకెటి నాగరాజు, డి.ధర్మరాజు, రాదానందం తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక మార్కులు సాధించాలి


ఉపాధ్యాయులతో పదో తరగతి విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించాలని ఫరీదుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం టి.నారాయణమూర్తి అన్నారు. పదో తరగతి విద్యార్థులకు బుధవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో విద్యార్థులు నృత్యాలతో అలరించారు. ఉపాధ్యాయులు సత్తారు శ్రీనివాసరావు, గురుగుబెల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన డి.పి.దేవ్


కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డి.పి.దేవ్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపటిటన తమీమ్ అన్సారియాను శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డి.పి.దేవ్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. కార్పొరేషన్ ప్రతినిధి మెండ రాంబాబు ఉన్నారు.

15న సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వాకర్స్‌క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆసరా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 15న ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎచ్చెర్ల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో సెమినార్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆసరా ప్రతినిధులు డాక్టర్ గంజి ఎజ్రా, గేదెల ఇందిరా ప్రసాద్, ఎస్.జోగినాయుడులు తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పి.జి.గుప్తా, నాగేశ్వర ఈశ్వరరావు, గేదెల అప్పల నాయుడు, జి.లక్ష్మి, వసంతలక్ష్మి, రాంబాయి, సావిత్రి పాల్గొన్నారు.

వరం హైస్కూల్‌కు పలు వస్తువుల అందజేత


మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం: గుజరాతీపేటలోని వరం హైస్కూల్‌కు పలువురు దాతలు జిరాక్సు మిషన్, మైక్‌సెట్, ఇన్వర్టర్, ఐదు బీరువాలను వితరణ చేశారు. వీటిని జిల్లా అధికారులు బుధవారం జరిగిన విద్యాంజలి కార్యక్రమంలో భాగంగా ప్రారంభించారు. జిరాక్సు మిషన్‌ను డీఈవో కె.వెంకటేశ్వరరావు, సౌండ్ సిస్టమ్‌ను ఏపీజీ రోణంకి జయప్రకాష్, ఇన్వర్టర్‌ను డిప్యూటీ ఈవో ఆర్.విజయకుమారి, బీరువాలను పాఠశాల వ్యవస్థాపక సభ్యులు అందవరపు సంతోషకుమార్, మల్ల కల్యాణ్‌చక్రవర్తి, శ్రీనివాస చక్రవర్తులచే ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఇక్కడే చదువుకున్న రాష్ట్ర సమగ్రశిక్షా పీడీ బి.శ్రీనివాసరావు చొరవతో పాఠశాలకు ఇన్ని సదుపాయల కల్పన జరుగుతుందని, భవిష్యత్తులో ఇంకా అభివృద్ధి సాధించాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు మెటీరియల్, పరీక్ష సామగ్రిని అందజేశారు.

విద్యార్థినులు శతశాతం ఫలితాలు సాధించాలి


విద్యార్థినులకు పరీక్ష సామగ్రిని అందజేస్తున్న కనకరాజు, ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభంకానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థినులు పూర్తిస్థాయిలో సమాయత్తమై శతశాతం ఫలితాలతో రాణించాలని నైరా వ్యవసాయ కళాశాల విశ్రాంత ప్రొఫెసర్ కె.కనకరాజు ఆకాంక్షించారు. శ్రీకాకుళం నగరంలోని హయాతీనగరంలో ఉన్న మహాత్మాజ్యోతిభాపూలే వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలలో టెన్త్ విద్యార్థినులకు అవసరమైన పరీక్ష సామగ్రిని కనకరాజు బుధవారం వితరణగా అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ జి.స్వరాజ్యలక్ష్మి చేతులమీదుగా వీటిని పంపిణీ చేశారు. విద్యార్థినులకు బాసటగా నిలిచిన విశ్రాంత ప్రొఫెసర్ కనకరాజుకు ప్రిన్సిపాల్ పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినులు, సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వేపై ప్రత్యేక దృష్టి సారించాలి


మాట్లాడుతున్న ఏఈఈ తిరుపతిరావు

జి.సిగడాం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూ సర్వేపై ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మీసాల సత్యవతి అధ్యక్షత బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ.. రీ సర్వే చేసిన తరువాత ఒక రైతుకు సంబంధించిన భూమికి మరోకరి పేరున అడంగల్ వస్తుందని సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై తహసీల్దార్ ఉమామహేశ్వరరావు స్పందిస్తూ.. గ్రామ పెద్దలు, రైతుల సమక్షంలో గ్రామసభ ఏర్పాటు చేసిన అర్హులైన వారందరికీ పక్కాగా భూహక్కు పత్రాలను అందస్తామని హామీ ఇచ్చారు. మండలంలోని అన్ని గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని ఏఈఈ కె.తిరుపతిరావు అన్నారు. మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, కాయల రమణ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన


ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని గాయత్రీ కాలేజ్ ఆఫ్ సైన్సు అండ్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు అన్నారు. కేంద్ర యువజన శాఖ, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో బుధవారం మునసబుపేటలోని గురజాడ విద్యాసంస్థలో ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొత్తగా ఓటు నమోదు చేసుకున్న యువత దేశ సమగ్ర అభివృద్ధికి దోహదపడే విధంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. విద్యార్థులతో ఓటు హక్కు వినియోగంపై ప్రమాణం చేయించారు. అనంతరం వ్యాసరచన, పెయింటింగ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.వి.వి.సత్యన్నారాయణ, ఐక్యూ కోఆర్డినేటర్ మార్తంగ కృష్ణ ఉన్నారు.

క్రైస్తవుల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి


రణస్థలం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: క్రైస్తవుల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పంక్షన్ హాల్‌లో ఎచ్చెర్ల నియోజకవర్గంలోని నాలుగు మండలాల పాస్టర్లు, క్రైస్తవులతో బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ అధికారంలోని వచ్చిన వెంటనే పాస్టర్లను గుర్తించి గౌరవ వేతనంగా రూ.5వేలు ఇవ్వడం జరిగిందన్నారు. పాస్టర్లు, క్రైస్తవుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. క్రైస్తవులను టీడీపీ ఎప్పుడూ గుర్తించలేదన్నారు. అర్హులైన క్రైస్తవులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు.

అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి ఆర్థికసాయం

రణస్థలం: లావేరు మండలంలోని గుమ్మడాం పంచాయతీ వేణుగోపాలపురం ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహా నిర్మాణానికి ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్‌రూ. 20వేలు ఆర్థికసహాయం అందజేశారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఈ మొత్తం అందించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రేగిడి లక్ష్మణరావు, ఎస్సీ కాలనీ వాసులు ఉన్నారు.

ఓటు వజ్రాయుధం


ర్యాలీ చేస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు

రణస్థలం: ప్రజాస్వామ్యంలో ఓటే బలమైన ఆయుధమని ఏపీఎం ఎం.వి.రత్నం తెలిపారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయ ఆవరణంలో నీ ఓటు – నీ భవిష్యత్‌పై మండలి మహిళా సమాఖ్య సభ్యులకు అవగాహన కల్పించారు. ప్రజలకు మంచి చేసే ప్రజాప్రతినిధులను ఎన్నుకొవాలంటే ఓటే వేయడమే ఉత్తమమార్గం అని తెలిపారు. ఓటు ఆకారంలో నిలబడి ఆకట్టుకున్నారు. ర్యాలీ చేపట్టి ఓటు ప్రాముఖ్యతను వివరించారు. వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన శివరాత్రి వేడుకలు


పుష్పాలంకరణలో ఉమాజఠలేశ్వరుడు

శ్రీకాకుళం కల్చరల్: నక్కవీధిలోని ఉమాజఠలేశ్వర స్వామి దేవాలయంలో బుధవారం నుంచి శివరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభమైనాయి. అర్చకులు అశ్వినీకుమార్, మహేష్‌ల ఆధ్వర్యంలో గణపతి పూజ, కాలభైరవ అర్చన, జఠలేశ్వరస్వామి వారి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, ఉమాదేవి కుంకుమార్చన చేపట్టారు. సాయంత్రం స్వామివారికి పుష్పాలతో అర్చనలు జరిగాయి. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముస్తాబైన మణి నాగేశ్వర ఆలయం

శ్రీకాకుళం రూరల్: కళ్లేపల్లి గ్రామంలోని గౌరి సమేత మణినాగేశ్వర స్వామి ఆలయం శివరాత్రి ఉత్సవాలకు సిద్ధమైనట్లు సర్పంచ్ గంగు నరేంద్రకుమార్ బుధవారం తెలిపారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. శుక్రవారం తెల్లవారుజాము మూడు గంటలకు ప్రథమార్చన సహిత పంచామృతాభిశేషంతో పాటు సహస్ర దీపారాధన, మహాన్యాస పూర్వక రుద్రాభిశేషంతో పూజలు నిర్వహించనున్నట్లు ప్రధానార్చకులు ఇప్పిలి సూర్యానారాయణమూర్తి శర్మ తెలిపారు.

'మిచాంగ్' బాధితులకు రూ. 12.41 లక్షల పరిహారం విడుదల


మిచాంగ్ తుఫాన్‌తో నీటిలో ఉండిపోయి పాడైన వరి పనలు (ఫైల్)

గార: గతేడాది డిసెంబర్ ఆరో తేదీన ఏర్పడిన మిచాంగ్ తుపాను కారణంగా మండలంలోని 12 గ్రామాల్లో చేతికి వచ్చిన వరిపంట పూర్తిగా కుళ్లిపోయింది. దీనిపై రైతులు ఆందోళన చెందగా రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు చొరవతో అధికారులు, మండల ఎంపీపీ, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో పర్యటించి నష్టాన్ని అంచనా వేయించారు. 232 మంది రైతులకు ఎకరాకు రూ. 6,800 చొప్పున నష్టపరిహారాన్ని బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగనమోహన్‌రెడ్డి విడుదల చేశారు. ఈ మేరకు గార మండల రైతులకు రూ. 12.41 లక్షలు విడుదలైందని ఎంపీపీ గొండు రఘురామ్, ఏవో దుంపల పద్మావతి తెలిపారు. రైతులు మంత్రి ధర్మాన ప్రసాదరావుకు, మండల ప్రజాప్రతినిధులు, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పదో తరగతే కీలకం


మాట్లాడుతున్న ఉమాకుమారి

శ్రీకాకుళం రూరల్: విద్యార్థులకు పదో తరగతి మొదటి మెట్టని, బంగారు భవితకు ఇదే కీలకమని ఒప్పంగి జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాకుమారి అన్నారు. టెన్త్ విద్యార్థుల వీడ్కోలు సభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పరీక్షలు బాగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. 131 మంది విద్యార్థులకు అవసరమయ్యే పరీక్ష సామగ్రిన్ని గౌరవ అతిథిగా విచ్చేసిన రిటైర్డ్ ఆర్మీ జవాన్ పి.భాస్కరరావు అందజేశారు.

ఫుడ్ కమిటీ సభ్యుడుకి సన్మానం


గోపీని సత్కరిస్తున్న దృశ్యం

గార: కేంద్ర ఫుడ్ కమిటీ సభ్యుడుగా నియమితులైన మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్, కొర్ని సర్పంచ్ పీస గోవిందరాజులు (గోపి)ను బుధవారం ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురామ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు గోపీని దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. జెడ్పీటీసీ సభ్యురాలు మార్పు సుజాతమ్మ, వైస్ ఎంపీపీ అరవల శార్వాణి, సర్పంచ్‌లు శ్రీనివాసరావు, ఆదినారాయణ పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు వేయండి


చిలకపాలెం జాతీయ రహదారిపై ఫ్లాగ్ మార్చ్

ఎచ్చెర్ల క్యాంపస్:

ప్రతిఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలంటూ ఎచ్చెర్ల, చిలకపాలెం గ్రామాల్లో బుధవారం కేంద్ర పోలీస్ దళాలు, స్థానిక పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. జేఆర్ పురం సీఐ రామచంద్రరావు, ఎస్సై చిరంజీవులు ఆధ్వర్యంలో ర్యాలీ చేపడుతూ నినాదాలు చేశారు. ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.